క్లుప్తంగా

పీజీఆర్ఎస్‌కు 11 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ శంకరరావు

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 11 వినతులు వచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్(ఇన్‌చార్జి) శంకరరావు వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్న సన్నిధిలో వీఎంఆర్డీఏ కమిషనర్



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న విశ్వనాథన్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ సోమవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను అధికారులు అందించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థి తల్లికి ఆర్థిక సాయం అందిస్తున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: పదోతరగతి చదువుతున్న పేద విద్యార్థి ఎర్ని సాయిగణేష్‌కు కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి సోమవారం రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. సంబంధిత నగదును విద్యార్థి తల్లికి అందించారు. కార్యక్రమంలో అడవివరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు బోర ప్రసాద్‌రెడ్డి, కొలుసు శ్రీను, కర్రి రాజు, డి.రమణ, డి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాలకు న్యాయం చేయాలి

మహారాణిపేట/పెందుర్తి: పెందుర్తి మండలం చినముషిడివాడ గ్రామం క్రాంతి నగర్‌లో నివాసం ఉంటున్న దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని ప్రజాహిత పిటిషనర్ గుండు అప్పలరాజు విశాఖ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో అధికారులకు వినతిపత్రం అందించారు. కొంత మంది దళారులతో కలిసి రెవెన్యూ అధికారులు తప్పుడు సమాచారం ప్రకారం నివేదిక తయారు చేశారని, దీంతో దళితులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. సీఎం పేషీ నుంచి ఆదేశాలు వచ్చినా.. విచారణ సక్రమంగా చేయకుండా వీఆర్వో, ఆర్ఐల నీరుగారుస్తున్నారని ఆరోపించారు. చాలా సార్లు వినతి పత్రాలు సమర్పించినా అధికారులు స్పందన సక్రమంగా లేదని ఆక్షేపించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని దళితులకు న్యాయం చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు.

కుట్టు శిక్షణ భవనం కోసం పరిశీలన



టైలరింగ్ సెంటర్ కోసం భవన పరిశీలనలో ఎన్టీపీసీ, చిన్మయ సంస్థ ప్రతినిధులు

పరవాడ: మండలంలో చిన్మయ గురుకులం గ్రామీణ వికాస కేంద్రం, ఎన్టీపీసీ సింహాద్రి సీఎస్సార్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నాయుడుపాలెంలో ఏర్పాటు చేయనున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్ర నిర్వహణకు అనువైన భవన సముదాయాలను సోమవారం పరిశీలించారు. గ్రామంలో 65 మంది మహిళలకు 6 నెలల పాటు ఉచితంగా కుట్టు శిక్షణ కల్పించేందుకు సంస్థ ముందుకొచ్చింది. దీంతో సంబంధిత అధికారులు శిక్షణ కేంద్రానికి అనువైన స్థానిక ఎలిమెంటరీ పాఠశాల, మెట్టపాలెంలోని రైతు సేవా కేంద్రం భవనాలను పరిశీలించారు. పరిశీలనలో చిన్మయ మిషన్, ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ప్రతినిధులు శివం, ప్రకాశరావు, నాయుడుపాలెం సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకుడు కూండ్రపు సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఆసియాలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం విశాఖ. పారిశ్రామికంగానూ పరుగులెడుతోంది. చాలా రంగాల్లో 24x7 సేవలు అందుబాటులో ఉన్నాయి. అలాంటి నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం సింహాచలానికి వెళ్లిన వారు నగరానికి చేరుకోవాలంటే.. రాత్రి 8.10 దాటితే బస్ సర్వీసులు లేవంటే ఆశ్చర్యపోనక్కర్లేదు. గతంలో రాత్రి 10 వరకు నడిచే బస్ సర్వీసుల్ని నిలిపేయడంతో భక్తులు అవస్థలు పడుతున్నారు.

రాత్రి 8.10 దాటితే.. ప్రైవేట్ రవాణాయే దిక్కు!

సింహాచలం నుంచి రాత్రి అందుబాటులో లేని బస్సులు

రైల్వేస్టేషన్, ద్వారకా బస్టేషన్‌కి వెళ్లాలంటే గగనమే... • అప్పన్న భక్తులకు తప్పని తిప్పలు



సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖద్వారం

సింహాచలం: రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలానికి భక్తుల తాకిడి రానురాను పెరుగుతోంది. శని, ఆదివారాలు, ప్రముఖ పర్వదినాల్లో భక్తుల రద్దీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి భక్తులు ఎక్కువగా వస్తుంటారు. వీరిలో చాలామంది పేద, మధ్యతరగతికి చెందిన వారే. విశాఖ రైల్వేస్టేషన్, ద్వారకా బస్టేషన్ చేరుకునే వీరంతా సింహాచలం రావాలంటే ఎక్కువగా ఆర్టీసీ సిటీ బస్సుల్నే ఆశ్రయిస్తారు. స్వామిని దర్శించుకున్నాక సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సిటీ సబ్సుల ద్వారా తిరిగి నగరానికి చేరుకుంటారు. అయితే రాత్రి 8.10 దాటాక ఇతర ప్రాంతాల భక్తులు నగరంలోని రైల్వే స్టేషన్, బస్టేషన్‌కు చేరాలంటే ఒక్క ఆర్టీసీ బస్ కూడా లేకపోవడం గమనార్హం.

బస్సెక్కాలంటే.. ఆటోలో వెళ్లాల్సిందే..

సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకుని రాత్రి 8.10 తర్వాత నగరంలోని రైల్వే స్టేషన్, బస్టేషన్‌కు వెళ్లాలంటే చాలా కష్టం. స్వామి దర్శనాలు రాత్రి 9 వరకు ఉంటాయి. భక్తులు తిరిగి కొండదిగువకు చేరే సరికి రాత్రి 10 దాటుతుంది. అప్పుడు గానీ భక్తులకు తెలియదు.. నగరంలోకి వెళ్లేందుకు బస్సుల్లేవని. పిల్లలతో వచ్చే భక్తుల కష్టాలు చెప్పనలవికానివి. ఇతర ప్రాంతాల నుంచి వివిధ పనులపై సింహాచలం వచ్చేవారిదీ ఇదే దుస్థితి. రాత్రి 8.15 దాటాక ఇతర ప్రాంతాల బస్సులూ అందుబాటులో ఉండవు. దీంతో గోపాలపట్నం లేదా వేపగుంటకు ఆటోల్లో వెళ్లి అక్కడి నుంచి నగరానికి, ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సుల్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి.

ఇతర డిపో బస్సుల రద్దు

సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వచ్చే సిటీ డిపోల బస్సులు దాదాపు రద్దు చేశారు. గతంలో మద్దిలపాలేనికి చెందిన నెం.6ఏ బస్సులు సింహాచలం నుంచి రాత్రి 10 గంటల వరకు కూడా నగరంలోని రైల్వేస్టేషన్, ద్వారకా బస్టేషన్ వెళ్లేందుకు అందుబాటులో ఉండేవి. మద్దిలపాలెం వైపు వెళ్లే నెం.540 బస్సు కూడా అదే సమయంలో ఉండేది. వీటిని కొంతకాలం క్రిందట రద్దు చేశారు. ప్రస్తుతం రాత్రి 8.50కు మాత్రమే ఆ బస్సు అందుబాటులో ఉంది.



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో భక్తులు, ప్రయాణీకుల రద్దీ



ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న బస్సులు

భక్తుల బాధలు పట్టవా!



అప్పన్న భక్తుల బాధల్ని ఆర్టీసీ అధికారులు అర్థం చేసుకోవాలి. సింహాచలం పుణ్యక్షేత్రం నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కి, ద్వారకా బస్టేషన్‌కి వెళ్లాలంటే రాత్రి 8.10గంటలకి ఆఖరి బస్సు అంటే విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు నైట్ బస్ సర్వీలు నడపాలి. **–వేణుగోపాల్, రిటైర్డ్ ఉద్యోగి, ఆరిలోవ**

గతంలో అందుబాటులో..



సింహాచలం వాసులు, భక్తులు నగరంలోకి వెళ్లాలంటే గతంలో సుమారు రాత్రి 10 గంటల వరకు సిటీ బస్సులు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఎ.ప్రసాద్, ప్రహ్లాదపురం

త్వరలో నైట్ సర్వీస్

త్వరలో ఒక 6ఏ సిటీ బస్సు సర్వీస్‌ను రోజూ రాత్రి 9.30కు సింహాచలం కొండపై బయలుదేరే లా ప్రణాళిక చేస్తున్నాం. ఆ బస్సు కొండదిగువ సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకునేసరికి రాత్రి 9.45 అవుతుంది. అక్కడి నుంచి నగరంలోని రైల్వేస్టేషన్ మీదుగా ద్వారకా బస్టేషన్‌కు చేరుకుని, తర్వాతి రోజు తెల్లవారు జాము 4.30కి అక్కడి నుంచి బయల్దేరాలా చర్యలు తీసుకుంటాం.

–శరత్, డిపో మేనేజర్, సింహాచలం

సింహాచలం నుంచి ఆఖరి బస్సులు

- ✔ మధ్యాహ్నం 3.40: నెం.55–దువ్వాడ రైల్వేస్టేషన్
- ✔ రాత్రి 7.05: నెం.60 హెచ్–హనుమంతవాక మీదుగా పాతపోస్టాఫీస్
- ✔ రాత్రి 7.50: నెం.55– గాజువాక మీదుగా సింధియా
- ✔ రాత్రి 7.55: నెం.28, 28 హెచ్– ఆర్కే బీచ్
- ✔ రాత్రి 8.10: 6ఏ–రైల్వేస్టేషన్ మీదుగా ద్వారకా బస్టేషన్
- ✔ రాత్రి 8.15: నెం.28 జెడ్–విశాఖ జిల్లా పరిషత్
- ✔ రాత్రి 8.50: నెం.540–మద్దిలపాలెం మీదుగా ఎంవీపీ కాలనీ



సింహాచలం కాంప్లెక్స్‌లో బస్ టైమింగ్స్ బోర్డు

అప్పన్న గోశాలలో శ్రీకృష్ణ జయంతి



గోపూజ నిర్వహిస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన శ్రీకృష్ణాపురం గోశాలలో శ్రీవైష్ణవ సాంప్రదాయం ప్రకారం సోమవారం శ్రీకృష్ణ జయంతి విశేషంగా నిర్వహించారు. గోశాలలో ఉన్న శ్రీకృష్ణుడి విగ్రహం చెంతన అర్చకుడు సంతోష్‌శర్మ శ్రీకృష్ణాష్టకం పఠించారు. గోశాలలో ఉన్న గోవులకు పసుపు కుంకుమలు సమర్పించారు. గోపూజ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. గోశాల సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్, రాష్ట్ర ప్రధాన దేవాలయాల సమాఖ్య అధ్యక్షుడు హరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో రైతుల తుది జాబితా



గ్రామ సభలో వీఎంఆర్డీఏ, రెవెన్యూ అధికారులు

పెందుర్తి: వేపగుంటలోని వీఎంఆర్డీఏ(వుడా) భూముల వివాదం కొలిక్కి వస్తుందని వీఎంఆర్డీఏ అధికారులు తెలిపారు. వేపగుంటలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో వీఎంఆర్డీఏ, రైతుల మధ్య జరుగుతున్న వివాదంపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ అధికారి దయానిధి పలు అంశాలపై రైతులకు అవగాహన కలిగించారు. పరిహారం విషయంలో వివాదాస్పద భూముల్లో ఉన్న రైతుల జాబితాను సిద్ధం చేశామన్నారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే వినతులు స్వీకరిస్తామని చెప్పారు. కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన సభలో డీటీలు పార్వతి, భాస్కర్, కిషోర్, ఆర్ఐలు పావని, ప్రసన్న, అధికారులు పాల్గొన్నారు.

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బిల్వపత్రాలతో అర్చన చేశారు.

అప్పన్న ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జయంతి

- ఘనంగా శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు
- నేడు రాజగోపురం వద్ద ఉట్ల సంబరం



సింహాసనంపై దేవకీదేవిని వేంజేపచేసి శ్రీకృష్ణ జయంతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై సోమవారం శ్రీకృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని విశేషంగా జరిపారు. ఆండాళ్లమ్మ ఉత్సవమూర్తిని దేవకీదేవిగా అలంకరించి పల్లకిలో వేంజేపచేసి బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. అనంతరం దేవకీదేవిని బేడా మండపంలో వేంజేపచేసి శ్రీకృష్ణ జననోద్ధారణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. బేడా తిరువీధి అనంతరం ఆస్థానమండపంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవి, ఆళ్వారుల చెంతన బాలకృష్ణున్ని ఉంచి పంచామృతాలతో అభిషేకం చేశారు. విశేష హారతులిచ్చారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, వేదపండితులు, పారాయణదారులు ఈ ఉత్సవాన్ని జరిపారు. శ్రీ కృష్ణ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుంచి ఆలయ రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహించనున్నారు.

టీకాలతో గాలికుంటు వ్యాధి నివారణ

పరవాడ: గాలి కుంటు వ్యాధి పట్ల పాడి రైతులు అప్రమత్తంగా వ్యవహరించి, తమ పాడి పశువులను కాపాడుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. తానాం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని గాలి కుంటు వ్యాధి నిరోధక టీకాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి అక్టోబర్ 30 వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరవాడ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణమూర్తి మాట్లాడుతూ చలికాలంలో సోకే గాలికుంటు వ్యాధి రాకుండా వేసే టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కస్నూరి దేవివెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, జనసేన నాయకుడు వంచకర్ల ప్రసాద్, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, నాయకులు మోటూరి సన్యాసినాయుడు, బుగిడి రామగోవిందరావు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: పాడి పశువులకు జాతీయ పశువ్యాధి నియంత్రణలో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండలంలోని గుల్లేపల్లిలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంపీపీ బోకం సూర్యకుమారి మాట్లాడుతూ వచ్చే నెల 30 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో షెడ్యూల్ ప్రకారం టీకా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు డాక్టర్ పి.చిట్టినాయుడు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు, గ్రామ పెద్దలు బండారు శ్రీను, గజ్జి నరసింగరరావు, గుల్లేపల్లి పశు వైద్యురాలు డాక్టర్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో డార్మెటరీ హాలు ప్రారంభం



డార్మెటరీ హాలును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పరవాడ: తానాం బాలికల గురుకుల పాఠశాలలో సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులు రూ.50 లక్షలతో ఏర్పాటు చేసిన డార్మెటరీ హాలును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను గుర్తించి అదనపు భవనాన్ని నిర్మించిన సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో తానాం సర్పంచ్ కస్నూరిదేవి వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, జనసేన నాయకుడు పంచకర్ల ప్రసాద్, ఎన్టీపీసీ అధికారులు బి.బి.పాత్ర, శివరాంప్రతాప్‌సింగ్, కె.ప్రకాశరావు, నాయకులు బొద్దపు శ్రీనివాసరావు, వర్రి పరదేశినాయుడు, పలువురు సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కళాఉత్సవ్ పోటీలకు ఆరిపాక విద్యార్థులు



కళా ఉత్సవ్ పోటీల విజేతలతో పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని రామలక్ష్మి

సబ్బవరం: మండలంలోని ఆరిపాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో భీమిలి ప్రభుత్వ డైట్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన కళాఉత్సవ్ పోటీల్లో ఐదు విభాగాల్లో సత్తా చాటినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎంజే రవీంద్రబాబు తెలిపారు. స్వదేశీ బొమ్మల తయారీ విభాగంలో కె.నీలవేణి, డి.దిలీప్ ప్రథమ బహుమతి, సాంప్రదాయ వాయిద్యం(సోలో)లో ఎస్ ప్రణీత, మూకాభినయంలో పి.జ్యోత్స్న, పి.హరీష్, జి.విజయ్‌కుమార్, షేక్ ఇస్మాయిల్ ద్వితీయ, సాంప్రదాయ కథల విభాగంలో అల్లూరి సీతారామరాజు బుర్రకథ చెప్పిన చిద్విలాస్, గుణ గౌరీష్ తృతీయ, జానపద పాటల విభాగంలో వి.యోగిశ్రీ, వి.హరిణీకారుణ్య, జి.దీపిక, వి.మమత ప్రోత్సాహక బహుమతులు అందుకున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు వచ్చే నెల విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఉత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులకు ఆయా విభాగాల్లో శిక్షణ అందించిన ఇంగ్లిష్ టీచర్ బీవీ రామలక్ష్మిని, విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యోగి, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం



సీసీ రోడ్లు, డ్రైన్లకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వసంత

పెందుర్తి: జీవీఎంసీ 97వ వార్డు కార్మికనగర్‌లో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శానాపతి వసంత సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో కాలనీలో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణపై ప్రత్యేక దృష్టి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు

పెందుర్తి: గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి సారించామని పెందుర్తి లా అండ్ ఆర్డర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ భాస్కర రావు అన్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కేవీ సతీష్‌కుమార్ ఆదేశాలతో ఎస్ఐ భాస్కరరావు బృందం సోమవారం పెందుర్తి కూడలి, రైల్వే స్టేషన్, సరిపల్లి కూడలి, పినగాడి కూడలి వద్ద డాగ్ స్క్వాడ్ సహాయంతో ఏజెన్సీ నుంచి వచ్చిన వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చెక్ పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచుతున్నామని చెప్పారు. గంజాయి వాడకం, అక్రమ రవాణా తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఆటో కార్మికుల రాష్ట్ర ధర్నాను జయప్రదం చేయండి

పరవాడ: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో నష్టపోతున్న ఆటో కార్మికులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సిటు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 18న విజయవాడలో జరగనున్న ఆటో కార్మికుల రాష్ట్ర ధర్నా గోడ పత్రికను సోమవారం పరవాడలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ధర్నాలో అన్ని ప్రాంతాల ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, పెంచిన ట్యాక్స్, పెనాల్టీలు, ఇన్సూరెన్స్‌లను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆటో కార్మిక యూనియన్ నాయకులు బలిరెడ్డి రమేష్, కె.సాయి, పి.ముని, వి.శ్రీను, వి.నరసింహరావు, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు, రుణాలపై అవగాహన తప్పనిసరి



ర్యాలీ, అవగాహన కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శచీదేవి, తదితరులు

సబ్బవరం: మహిళలంతా తమ జీవనోపాధి మెరుగుపర్చుకునేలా ఆర్థికంగా ఎదగాలని డీఆర్డీఏ పీడీ కె.శచీదేవి తెలిపారు. మండలంలోని ఇరువాడ శివారు గణపతినగర్‌లో మహాగణపతి గ్రామ సంఘం ఆధ్వర్యంలో మన డబ్బులు–మన లెక్కలు కార్యక్రమంపై ర్యాలీ, గ్రామ సభ సోమవారం నిర్వహించారు. మన డబ్బులు, మన లెక్కలు యాప్ ద్వారా తమ సంఘం పొదుపు, అప్పులు, వ్యక్తిగత పొదుపు, అప్పుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. తేడాలు ఉంటే ఫిర్యాదు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పి.వెంకట రమణ, ఏపీఎం సీహెచ్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు దాసరి సునీత, గ్రామ సంఘం అధ్యక్షురాలు కోన విజయ, గ్రామ పెద్దలు రేసుపూడి రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రెండు చోరీ కేసుల్లో ఇద్దరి అరెస్ట్

బంగారం, వెండి ఆభరణాల స్వాధీనం



ముద్దాయిలతో పరవాడ సీఐ మల్లికార్జునరావు

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు చోరీ కేసులకు సంబంధించి ఇరువురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చోరీలకు పాల్పడిన అనంతపురం జిల్లా పెద్ద వడుగురు మండలం తేలికి గ్రామానికి చెందిన కోనాం రవితేజ, లంకెలపాలెం దరి గెంజిపేటకు చెందిన జామిశెట్టి కృష్ణచైతన్యలను లంకెలపాలెంలో సోమవారం అరెస్టు చేశామన్నారు. సీఐ తెలిపిన వివరాలు..

ఈ ఏడాది జూన్ 21న లంకెలపాలెం రామాలయం వీధికి చెందిన సూరిశెట్టి వెంకటలక్ష్మి, జూలై 12న లంకెలపాలెం దరి శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన డొంకాడ విమలకుమారి ఇళ్లలో నిందితులు చోరీలకు పాల్పడ్డారు. 10 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి ఆభరణాలను అపహరించుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ ఆధ్వర్యంలో సీఐ మల్లికార్జునరావు తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులను లంకెలపాలెం ఐవోసీ బంకు వద్ద చాకచక్యంగా పట్టుకుని, వారి నుంచి 5.75 తులాల బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి వస్తువులను స్వాధీనపర్చుకున్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు. కేసును ఛేదించిన సీఐను, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, క్రైం అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావులు అభినందించారు.

వేంకటాద్రిపై ఘనంగా వైష్ణవ కృష్ణాష్టమి



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

పెందుర్తి: వైష్ణవ కృష్ణాష్టమి పురస్కరించుకుని స్థానిక వేంకటాద్రిపై సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు జరిపారు. అనంతరం ద్వాదశ ఆరాధన, 12 రకాల ప్రసాదాలతో నివేదన చేశారు. భక్తుల గోవింద నామస్మరణ నడుమ ఉట్టి సంబరం అంబరాన్ని తాకింది. ఊంజల్ సేవ, పవళింపు సేవ చేశారు. ఈవో నీలిమ పర్యవేక్షణలో జరిగిన వేడుకలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

దుర్గమ్మ దర్శనానికి పాదయాత్ర



బ్రాహ్మణిముత్యాలమ్మ సన్నిధిలో భక్తులు

పరవాడ: స్థానిక గురు భవాని గండి సత్యనారాయణ ఆధ్వర్యంలో విజయవాడలోని కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు పరవాడ గ్రామానికి చెందిన పలువురు భక్తులు సోమవారం కాలినడకన విజయవాడ బయలుదేరారు. తొలుత వీరు గ్రామంలోని బ్రాహ్మణి ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. గ్రామానికి చెందిన రొంగలి రమణ, పైల అప్పారావుతో పాటు పలువురు భక్తులు పాదయాత్ర సాగించి కనకదుర్గమ్మ ఆలయానికి చేరుకుంటామన్నారు.

మృతిచెందిన వృద్ధురాలి నేత్రాలు దానం



గోపమ్మ(ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన ఓ వృద్ధురాలి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి పెద్ద మనసు చాటుకున్నారు. వివరాలివి.. స్థానిక అయ్యప్పకాలనీలో నివాసం ఉంటున్న డబ్బీరు గోపమ్మ(80) సోమవారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురై, మరణించింది. సమాచారం అందుకున్న స్థానిక సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ కుటుంబ సభ్యులను నేత్రదానం కోసం ఒప్పించారు. మోహిషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి మనోజ్ మృతురాలి నేత్రాలు(కార్నియా) సేకరించారు.